సాక్షి కర్నూలు

మంగళవారం । 3 । సెప్టెంబర్ । 2024



అహోబిలంలో పూజలు

ఆళ్లగడ్డ: అహోబిలంలో అమావాస్య సందర్భంగా సోమవారం ఉత్సవమూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములకు పంచామృతాలతో అభిషేకించి పూజలు చేశారు.



శాస్త్రోక్తంగా సహస్ర దీపార్చన

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి ఉత్సవమూర్తులకు సోమవారం సహస్ర దీపార్చన సేవ చేపట్టారు. స్వామిఅమ్మవార్లను వెండి రథంపై ఉంచి ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తిమట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,631.61
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	: 99.326
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 30,031
అవుట్ ఫ్లో(క్యూసెక్కులు)	:15,237

న్యూస్‌రీల్

4న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను ఈ నెల 4న ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు ఆయా స్థాయీ సంఘాల సమావేశాల సమయానికి హాజరు కావాలని సీఈఓ కోరారు.

డిగ్రీ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మే, జూన్ నెలలో డిగ్రీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించామని, వాటి ఫలితాలను సోమవారం విడుదల చేసినట్లు వర్సిటీ ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మొత్తం 3,154 మంది పరీక్షలకు హాజరు కాగా 1,635 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఫలితాలు వర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, సమాధాన పత్రాల రీ వాల్యుయేషన్‌కు ఈనెల 10వ తేదీలోగా తగిన రుసుం చెల్లించి సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ వద్ద రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ సదస్సు

- నేడు, రేపు నిర్వహణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు సిటీ: డాక్టర్స్ కాలనీలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో మంగళ, బుధవారాల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు పోస్టర్లను సోమవారం కాలేజీలో ప్రిన్సిపాల్ డా.ఇందిరాశాంతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'తెలుగులో అనువాదసాహిత్యం-సమాలోచన' అనే అంశంపై వెబినార్‌లో సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సదస్సుకు ఉన్నత విద్య శాఖ కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, క్లస్టర్ యూనివర్సిటీ వీసీ డీవీఆర్ సాయిగోపాల్, రిజిస్ట్రార్ కట్టా వెంకటేశ్వర్లు హాజరుకానున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ జె.హేమంత్, కాలేజీ అకడమిక్ కో-ఆర్డినేటర్ టి.మాదన్న, తెలుగు విభాగాధిపతి డా.వి వింధ్యవాసిని దేవి, అధ్యాపకులు రాము దాసరి, తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరకే ఉచిత పంటల బీమా

- రబీ నుంచి ప్రీమియం రైతులు చెల్లించాల్సిందే

కర్నూలు(అగ్రికల్చర్): ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఉచిత పంటల బీమా పథకాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. అయితే బీమా కేవలం ఈ ఖరీఫ్‌కే పరిమితం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఐదేళ్లు అమలు చేసింది. రైతులపై రూపాయి భారం పడకుండా బీమా పరిహారం రూ.1000 కోట్ల వరకు అందించింది. కూటమి ప్రభుత్వం ఉచిత పంటల బీమాకు మంగళం పలికేందుకు రంగం సిద్ధం చేసింది. కేవలం ఖరీఫ్ సీజన్ వరకు ఉచిత పంటల బీమాను అమలు చేయనుంది. 2024-25 రబీ సీజన్ నుంచి రైతులు నోటిఫై చేసిన పంటలకు విధిగా ప్రీమియం చెల్లించాల్సిందే. ఆహార పంటలకు 2 శాతం, వాణిజ్య పంటలకు 6 శాతం వరకు ప్రీమియం చెల్లించాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత బీమా పథకాల అమలుకు ప్రభుత్వం బీమా కంపెనీలను కూడా ఎంపిక చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతుల వాటా మొత్తాన్ని బీమా కంపెనీలకు చెల్లిస్తేనే బీమా సొమ్ము అందనుంది.

ఘనంగా జియారత్ వేడుకలు

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన పెద్ద రాజు స్వామి దర్గా ఉరుసులో భాగంగా 3వ రోజు సోమవారం జియారత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రి, దర్గా నిర్వాహకులు సయ్యద్‌షా బాషా ఖాద్రి పెద్ద రాజు స్వామికి జియారత్ గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం దర్గా ఆవరణలో జియారత్ ఉత్సవాలు నిర్వహించి, భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు గూటుపల్లెకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.

సాగులో గ్యాప్ గెలుపు

- వైఎస్సార్‌సీపీ హయాంలో మొదలైన గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ పద్ధతి
- తక్కువ పెట్టుబడితో నికరాదాయాన్ని సాధిస్తున్న రైతులు
- పండించిన పంటలకు ఆర్గానిక్ సర్టిఫికెట్ జారీ
- ఈ ఏడాది ప్రతి మండలంలో 'గ్యాప్'తో పంటల సాగు
- ప్రజలకు సురక్షిత ఆహారం అందించడమే లక్ష్యం



సి.బెళగల్ మండలం కొండాపురంలో గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ పద్ధతులతో వరి నాట్లు వేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయంలో రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకాన్ని తగ్గించి నాణ్యమైన పంటలను పండించేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ (గ్యాప్) పద్ధతి సత్ఫలితాలను ఇస్తోంది. గతేడాది ప్రయోగాత్మకంగా 'గ్యాప్' పద్ధతులతో కర్నూలు జిల్లాలో వరి, నంద్యాల జిల్లాలో కొర్ర సాగు చేసిన రైతులు నికరాదాయం పొందారు. ఈ ఏడాది జిల్లాలో ప్రతి మండలంలోనూ 'గ్యాప్'తో పంటలు సాగు చేసేవిధంగా వ్యవసాయాధికారులు చైతన్యం తీసుకొస్తున్నారు. దీంతో చాలా మంది రైతులు 'గ్యాప్' పద్ధతులకు అనుగుణంగా ఆహార పంటలు పండించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రతి మండలంలో పొలంబడి

ఈ ఏడాది వ్యవసాయ శాఖ ప్రతి మండలంలో గ్యాప్ పద్ధతులతో ఆహార పంటలు సాగు చేసేవిధంగా ఒక పొలంబడి నిర్వహిస్తోంది. వేరుశనగ, కంది, మొక్కజొన్న, వరి, కొర్ర పంటల్లో జిల్లా మొత్తం మీద 25 'గ్యాప్' పొలంబడులు జరపాలని నిర్ణయించింది. రైతులు సామూహికంగా 10 నుంచి 30 ఎకరాల వరకు సాగు చేయవచ్చు. ఆసక్తి ఉంటే ఎంతమంది రైతులైనా సాగు చేసుకోవచ్చు. గ్యాప్ పద్ధతులతో సాగు చేసిన పంటలను పొలంబడిలో భాగంగా 10-15 రోజులకోసారి క్షేత్రస్థాయికి వెళ్లి వ్యవసాయ అధికారులు పరిశీలిస్తారు. ఏవైనా సమస్యలు ఉంటే వాటి నివారణకు తగిన సూచనలు ఇస్తారు. సమస్యల తీవ్రత ఎక్కువగా ఉంటే శాస్త్రవేత్తలను కూడా పొలంబడికి పిలుస్తారు. గ్యాప్ పద్ధతులతో సాగు చేసిన పంటల్లో చీడపీడల నివారణకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆమోదించిన కెమికల్స్‌ను మోతాదు మేరకు వినియోగించవచ్చు. ఈ పంటలను సీడ్ సర్టిఫికేషన్ అధికారులు, ఆర్గానిక్ సర్టిఫికేషన్ అధికారులు కూడా తనిఖీ చేస్తారు.

> **కెమికల్స్ లేకుండా వరి పండించాం**
>
> 
>
> మేం గతేడాది గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ పద్ధతుల్లో 2.75 ఎకరాల్లో వరి వేశాం. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించ లేదు. ఒక దశలో పచ్చపురుగు, దోమ కనిపించింది. నివారణకు క్లోరోపైరిఫాస్ పిచికారీ చేయాలని అధికారులు సూచించారు. కాని మేం దానివైపు వెళ్లకుండానే పంట పండించాం. మామూలుగా అయితే ఎకరాకు వరిసాగులో రూ.45 వేల నుంచి రూ.50 వేల వరకు పెట్టుబడి వ్యయం వస్తుంది. మేం గ్యాప్ పద్ధతులు పాటించడంతో ఎకరాకు రూ.28వేలు ఖర్చు అయ్యింది. మొత్తం 2.75 ఎకరాలకు పెట్టుబడి రూ.74,250 వచ్చింది. ధాన్యాన్ని మిల్లింగ్ చేయగా 32 క్వింటాళ్ల బియ్యం అయ్యాయి. వీటిని క్వింటాలు రూ.7000 ప్రకారం విక్రయించాం. బియ్యం అమ్మడం ద్వారా రూ.2.24 లక్షలు వచ్చింది. పెట్టుబడి వ్యయం మినహాయిస్తే రూ.1. 49 లక్షల నికరాదాయం వచ్చింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో కూడా గ్యాప్ పద్ధతులతోనే వరి సాగు చేస్తున్నాం.
>
> – పి.మధుసూదన్‌రెడ్డి, రైతు, కొండాపురం, సి.బెళగల్ మండలం

అధికారులు ఏం చేస్తారంటే..

- సంబంధిత ఏవో, ఏడీఏలు, జిల్లా వనరుల కేంద్రం అధికారులు ప్రతి పొలంబడికి వెళ్లి 'గ్యాప్' పంటలను పరిశీలిస్తారు.
- వేపచెక్కను ఎలా వినియోగించాలో అవగాహన కల్పిస్తారు.
- గో ఆధారిత పద్ధతులతో చీడపీడలు ఎలా నివారించవచ్చో చెబుతారు.
- పంట కోతలు పూర్తి కాగానే ఆర్గానిక్ సర్టిఫికెట్ జారీ చేయడానికి ముందు శ్యాంపుల్స్ సేకరించి గుంటూరులోని వ్యవసాయ శాఖ ల్యాబ్‌కు పంపుతారు. అక్కడ జరిపే పరీక్షల్లో కెమికల్స్ ప్రభావం జీరో ఉన్నట్లు స్పష్టమైతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఆర్గానిక్ సర్టిఫికెట్ కూడా జారీ చేస్తుంది.

ఆదర్శం.. తుంగభద్ర సేంద్రియ రైతు ఉత్పత్తిదారుల సంఘం

జిల్లాలోని తుంగభద్ర సేంద్రియ వ్యవసాయ ధాన్య రైతు ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోంది. 2023-24లో సి.బెళగల్ మండలం కొండాపురం (రంగాపురం), గుండ్రేవుల గ్రామాల్లో మోడల్‌గా గుడ్ అగ్రికల్చర్ ప్రాక్టీస్ విధానాలతో బీపీటీ 5204 రకం వరి సాగు చేశారు. 50 మంది రైతులతో 24.09 హెక్టార్లలో గ్యాప్ పద్ధతులకు అనుగుణంగా వరి పండించారు. కొండాపురం, గుండ్రేవుల రైతులు పండించి మిల్లింగ్ చేసిన బియ్యానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ సర్టిఫికేషన్ అథారిటీ ఆర్గానిక్ సర్టిఫికెట్ కూడా జారీ చేసింది. రసాయన ఎరువులు, పురుగు మందులతో పండించిన బియ్యం క్వింటాలు రూ.5,500 ప్రకారం విక్రయించుకుంటే, ఆర్గానిక్ సర్టిఫికెట్ పొందిన రైతులు పండించిన బియ్యానికి రూ.7,000 ధర లభించింది. మామూలుగా అయితే వరి సాగులో ఎకరాకు సగటున 45 వేల వరకు పెట్టుబడి వ్యయం వస్తుంది. గ్యాప్ పద్ధతులకు అనుగుణంగా వరి సాగు చేయడం వల్ల ఎకరాకు వచ్చిన పెట్టుబడి వ్యయం రూ.28 వేలు మాత్రమే. హెక్టారుకు 32 క్వింటాళ్ల బియ్యం ఉత్పత్తి అయ్యాయి.

గ్యాప్ పద్ధతులతో ఆహార పంటల్లో నిర్వహించే పొలంబడుల వివరాలు

పంట	నిర్వహించే పొలంబడులు
వేరుశనగ	5
కంది	8
మొక్కజొన్న	2
వరి	5
కొర్ర	5
మొత్తం	25

పకడ్బందీగా 'గ్యాప్' పొలం బడులు



గతేడాది కేవలం వరి పంటలో మాత్రమే గ్యాప్ పొలంబడి నిర్వహించాం. ఈసారి వరి, వేరుశనగ, కంది, కొర్ర, మొక్కజొన్న పంటల్లో నిర్వహిస్తున్నాం. వెల్దుర్తి మండలంలో కొర్ర, కల్లూరు మండలంలో కంది, గోనెగండ్ల మండలంలో వేరుశనగ, ఓర్వకల్లు మండలంలో మొక్కజొన్న, సి.బెళగల్ మండలంలో వరి పంటల్లో పొలంబడి నిర్వహిస్తున్నాం. పండించిన ఈ పంటలకు పరీక్షలు నిర్వహించిన తర్వాత ఆర్గానిక్ సర్టిఫికేషన్ జారీ అవుతుంది. ఈ సర్టిఫికెట్ వచ్చిన తర్వాత రైతులు పంటలను అధిక ధరలతో అమ్ముకోవచ్చు.

– పీఎల్ వరలక్ష్మి, జిల్లా వ్యవసాయ అధికారి, కర్నూలు

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని సహించం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

కర్నూలు కల్చరల్: అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ - పీజీఆర్ఎస్) కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ బి.నవ్య ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అర్జీల పరిష్కారం పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూ, పోలీసు శాఖల్లో రీ ఓపెన్ అర్జీలు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై జాయింట్ కలెక్టర్, డీఆర్వో సమీక్ష చేయాలని సూచించారు. పక్షం రోజులకు ఒకసారి ఈ రిపోర్టుపై తాను కూడా సమీక్ష నిర్వహిస్తానన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 56 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. వసతి గృహాల తనిఖీ నివేదికను సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తనిఖీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళాలు

జిల్లాలో మంగళవారం కర్నూలు, ఆలూరులో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జాబ్‌మేళాలకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కర్నూలు బిర్లాగేట్ పోస్టాఫీస్ వద్ద ఉన్న నాక్ సెంటర్‌లో నిర్వహించే జాబ్ మేళాలో పది కంపెనీలు 625 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాలో ఐదు కంపెనీలు 275 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, పీజీ చదివిన వారు, 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్న వారు ఉద్యోగాలకు అర్హులని తెలిపారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి. నవ్య పాల్గొన్నారు.

ఉద్యోగం పేరుతో మోసం

- ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితుడు



ఎస్పీకి సమస్యలు విన్నవిస్తున్న బాధితులు

కర్నూలు: కర్నూలులో సచివాలయం ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తాండ్రపాడు గ్రామానికి చెందిన మహేశ్వరరెడ్డి అనే వ్యక్తి రూ.5 లక్షలు తీసుకుని మోసం చేశాడని తుగ్గలి మండలం మారెళ్ల గ్రామానికి చెందిన లక్ష్మన్న ఎస్పీ బిందు మాధవ్‌కు ఫిర్యాదు చేశారు. కర్నూలు రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పక్కనున్న క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించి వారితో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమానికి మొత్తం 96 ఫిర్యాదులు వచ్చాయి. వాటన్నింటిపై చట్ట పరిధిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, సీఐ శివశంకర్, ఎస్ఐ పెద్దయ్య నాయుడు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

- వృద్ధాప్యంలో తమ బాగోగులు చూసుకోవాల్సిన కుమారుడు అన్నం పెట్టకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని కర్నూలు నగరానికి చెందిన లక్ష్మీదేవి ఫిర్యాదు చేశారు.
- పుట్టినింటి నుంచి అదనపు కట్నం తీసుకురావాలని భర్త, అత్త కలసి వేధిస్తున్నారని, వారి వల్ల తనతో పాటు పిల్లలకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాల్సిందిగా కర్నూలు బుధవారపేటకు చెందిన పార్వతి ఫిర్యాదు చేశారు.
- విత్తనం వేసిన పొలాన్ని దౌర్జన్యంగా కొందరు ట్రాక్టర్‌తో దున్ని పాడు చేశారని, విచారణ జరిపి చర్యలు తీసుకోవలసిందిగా సి.బెళగల్‌కు చెందిన గోవిందమ్మ కోరారు.
- కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామ శివారులో 2.76 ఎకరాల భూమిని సర్వేయర్ కొలత వేసి హద్దులు పాతితే పక్క పొలం వారు హద్దులు చెరిపేసి గొడవ సృష్టిస్తున్నారని డోన్ పట్టణానికి చెందిన నవీన్‌కుమార్ ఫిర్యాదు చేశారు.

పల్లకోత్సవం.. భక్తిపారవశ్యం

- ఈరన్న స్వామి పల్లకీకి ఊరూరా ఘన స్వాగతం
- గ్రామాల్లో పండుగ వాతావరణం



తుంగభద్ర నదిలో ఉరుకుంద ఈరన్న స్వామికి పుణ్య స్నానం ఆచరిస్తున్న పండితులు



కందుకూరు గ్రామంలో భక్తజనం మధ్య స్వామి వారి పల్లకోత్సవం

కోసిగి: శ్రావణ మాస ఉత్సవాల్లో భాగంగా ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామున ఉరుకుంద ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి.. స్వామి వారి విగ్రహాన్ని పల్లకీలో కొలువుంచారు. అనంతరం ఉత్సవాన్ని ప్రారంభించారు. వివిధ గ్రామాల్లో పల్లకోత్సవానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. స్వామి పల్లకీ సాగిన గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. జాతర సందడి కనిపించింది. కోసిగి మండలం కందుకూరు గ్రామం వరకు పల్లకీ సాగింది. అక్కడ రామలింగేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఉన్న తుంగభద్ర నదిలో పండితులు వేదమంత్రాలు పఠిస్తుండగా అర్చకులు, అధికారులు స్వామి వారికి పుణ్య స్నానం చేయించారు. అనంతరం నది ఒడ్డున దింపుడు కట్టపై స్వామి వారిని కొలువుంచి అభిషేకాలు చేసి, మహామంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామి వారికి నారికేళాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తిరిగి స్వామి వారి పల్లకీలో ఊరేగింపుగా కామన్‌దొడ్డి, తిప్పలదొడ్డి, కరణి గ్రామాల మీదుగా ఉరుకుంద క్షేత్రానికి చేరుకున్నారు. అంతకు ముందు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు వై. ప్రదీప్ రెడ్డి.. నది ఒడ్డుకు చేరుకుని, స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేసుకున్నారు. పార్టీ మండల కన్వీనర్ బెట్టన గౌడ, జెడ్పీటీసీ సభ్యులు పవిత్ర పాటిల్, ఎంపీపీ ఈరన్న, పార్టీ నాయకులు నాడుగేని నరసింహులు, నాడుగేని నాగరాజు, బుల్లి నరసింహులు, తాయన్నలు స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేసుకున్నారు. పల్లకోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

కర్నూలు(అగ్రికల్చర్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం జిల్లాలో అంతంతమాత్రంగానే ఉంది. ఆగస్టు 30, 31 తేదీల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. ఈనెల 1, 2 తేదీల్లో తేలికపాటికే పరిమితమయ్యాయి. ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు జిల్లా మొత్తంగా సగటున 33.1 మి.మీ వర్షపాతం నమోదైంది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు దాదాపు అన్ని మండలాల్లోనూ తేలికపాటి వర్షాలు కురిశాయి.

- ఆగస్టు నెలలో కురిసిన అధిక వర్షాల వల్ల 5,205 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి.
- ఉద్యాన పంటలు 15.80 హెక్టార్లలో దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.
- ఆగస్టు నెల సాధారణ వర్షపాతం 116.1 మి.మీ ఉండగా 200.1 మి.మీ వర్షపాతం నమోదైంది.
- సెప్టెంబరు నెల సాధారణ వర్షపాతం 116.5 మి.మీ ఉండగా రెండు రోజుల్లో 13.3 మి.మీ వర్షం కురిసింది.

సచివాలయాల్లోనే పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): సెప్టెంబరు నెల సామాజిక భద్రత పింఛన్‌ల పంపిణీ రెండో రోజు సోమవారం కూడా సచివాలయాల్లోనే జరిగింది. దీంతో వృద్ధులు, వ్యాధిగ్రస్తులు అతికష్టమ్మీద సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. సోమవారం రాత్రి రాత్రి 7 గంటల సమయానికి పింఛన్ల పంపిణీలో కర్నూలు జిల్లాకు రాష్ట్రంలో మొదటి స్థానం, నంద్యాల జిల్లాకు 10వ స్థానం లభించాయి. కర్నూలు జిల్లాలో 2,42,583 పింఛన్లు ఉండగా.. 2,41,293 పంపిణీ చేశారు.

జోహార్.. వైఎస్సార్

- మహానేతను స్మరించుకున్న ప్రజలు
- జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు
- దివంగత నేత విగ్రహాలకు పాలాభిషేకాలు
- పలుచోట్ల అన్నదానాలు, రోగులకు పండ్ల పంపిణీ



కర్నూలులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, మేయర్ రామయ్య, మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, నియోజకవర్గ సమన్వయకర్త ఇంతియాజ్ తదితరులు



శరీన్‌నగర్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కర్నూలు (టౌన్): మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డిని ప్రజలు స్మరించుకున్నారు. జోహార్.. వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం జిల్లా వ్యాప్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మహానేత విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు చోట్ల అన్నదానాలు చేశారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, పేదలకు ఇళ్లు, భూపంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలతో ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకొచ్చారని కొనియాడారు. తండ్రి ఆశయాలకు అనుగుణంగా పేద ప్రజల కోసం పనిచేస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అండగా నిలుద్దామని నేతలు పిలుపు నిచ్చారు. కోడుమూరు నియోజకవర్గంలోని గార్గేయపురంలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆదిమూలపు సతీష్ వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాలలు వేశారు. ఎమ్మిగనూరులో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కె.ఎస్. రఘు, వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రుద్రగౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు. పత్తికొండ పార్టీ మాజీ ఎంపీపీ నాగరత్నమ్మ, సర్పంచ్ దీపిక ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- పాణ్యం అర్బన్ పరిధిలోని కల్లూరు శరీన్‌నగర్‌లో మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- ఆదోని పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. గోశాల ఆసుపత్రి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి గజమాల వేసి నివాళులర్పించారు. పట్టణ అధ్యక్షులు చంద్రకాంత్, పార్టీ నాయకులు దేవా, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్ పాలన స్వర్ణయుగం

దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాలన స్వర్ణయుగం అని వైఎస్సార్‌సీపీ నేతలు అన్నారు. కర్నూలు ఎస్‌బీఐ సర్కిల్‌లోని మహానేత విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ.. చరిత్రలో నిలిచిపోయే పథకాలు అమలు చేసి ప్రజల మదిలో వైఎస్సార్ చెరగని స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. మహానేత మరణంతో వేలాది ప్రజల గుండెలు ఆగిపోయాయంటే.. ఎంతగా ఆయనపై అభిమానం ఉందో తెలుస్తోందన్నారు. మహానేత అడుగు జాడల్లో నడుస్తున్న జగనన్నకు అండగా నిలుద్దామన్నారు. కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య మాట్లాడుతూ.. ఉచిత విద్యుత్, జలయజ్ఞంను అమలు చేసి రైతు ఆత్మహత్యలు లేకుండా చేసిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. ఆయన ప్రవేశ పెట్టిన ఎన్నో సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు అమలు చేశారన్నారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. మహానేత వైఎస్సార్ సంక్షేమానికి పెద్ద పీట వేశారన్నారు. ముస్లిం మైనార్టీలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న మంచి ఆలోచనతో నాలుగు శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తు చేశారు. కర్నూలు నియోజవర్గ సమన్వకర్త ఇంతియాజ్ మాట్లాడుతూ.. వైఎస్సార్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటారన్నారు. పేద ప్రజలకు ఆయన ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదిమోహన్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్, కరుణాకర్ రెడ్డి, షరీఫ్, కిషన్, కార్పొరేటర్లు క్రాంతి కుమార్, విక్రమ సింహారెడ్డి, లక్ష్మీకాంత రెడ్డి, మునెమ్మ, యూనుస్‌బాషా, జుబేర్, కార్యకర్తలు, మహిళా నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.